www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

8 పేజీలు

ఏలూరు

పశ్చిమ గోదావరి

దెందులూరు, ఉండిపై..

వీడని సస్పెన్స్..!

కూటమి అభ్యర్థులపై తేలని పంచాయతీ

టిడిపి, బిజెపి నేతల్లో అయోమయం

రఘురామకృష్ణంరాజు, తపన చౌదరికి ఖాయమని ప్రచారం

నామినేషన్లు ప్రారంభమైనా నాన్చుడుపై కేడర్‌లో ఆగ్రహం

కూటమిలో పొత్తు పరేషాన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమవరం

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు రాజకీయం సమస్యలకు నిలయంగా మారిందనే విమర్శలు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల నుంచే వెలువడుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లాలో దెందులూరు, పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపై జరుగుతున్న ప్రచారం ఆయా పార్టీల నాయకులను, కార్యకర్తలను ఆయోమయంలో పడేసింది. నామినేషన్ల పర్వం ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ ఉండి, దెందులూరు స్థానాలపై సస్పెన్షన్ కొనసాగుతుండటం గమనార్హం. దెందులూరు స్థానం మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు టిడిపి కేటాయించింది. చింతమనేని ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పొత్తులో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి స్థానాన్ని ముందుగా బిజెపికి కేటాయించారు. సమస్యలు రావడంతో ఇరుపార్టీల నేతలు చర్చించుకుని అనపర్తి స్థానం టిడిపికి ఇచ్చేలా మార్పు చేశారు. అందుకు బదులుగా దెందులూరు స్థానం బిజెపికి కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతున్నట్లు తెలిసింది. బిజెపి నాయకుడు తపన చౌదరికి ఏలూరు ఎంపీ టిక్కెట్ ఇస్తారని తొలుత ప్రచారం సాగింది. పొత్తులో భాగంగా ఏలూరు ఎంపీ స్థానం టిడిపికి దక్కింది. దీంతో ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ యాదవ్‌ను టిడిపి నిలబెట్టింది. దీంతో తపనచౌదరికి న్యాయం చేయాలంటూ బిజెపి అధిష్టానంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరిగినట్లు సమాచారం. అందులో భాగంగా తపన చౌదరికి దెందులూరు టిక్కెట్ ఇచ్చేవిధంగా టిడిపి అధిష్టానంతో ఒప్పందం కుదిరినట్లు ప్రచారం సాగుతోంది. చింతమనేని బలమైన అభ్యర్థి కావడంతోపాటు గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో అనేక కేసులు ఎదుర్కొన్నారు. చింతమనేనికి దిగువస్థాయిలో బలం ఉందని చెప్పొచ్చు. ఇన్ని రోజులు ప్రచారం చేసిన తర్వాత నామినేషన్ వేసేటప్పుడు దెందులూరు టిక్కెట్ బిజెపికి కేటాయిస్తారనే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను అయోమయంలో పడేసింది. చింతమనేని కాకుండా బిజెపికి టిక్కెట్ ఇస్తే ఇక్కడ ఓటమి ఖాయమనే అభిప్రాయం సైతం సర్వత్రా వ్యక్తమవుతోంది. రెండుసార్లు ఎంఎల్ఎగా పని చేసిన చింతమనేనికి ఆఖరి నిముషంలో టిక్కెట్ లేకుండా చేస్తే జరగబోయే పరిణామాలపైనా అందరిలోనూ చర్చ నడుస్తోంది. ఏదేమైనా కూటమిలో అభ్యర్థుల పంచాయతీ ఇప్పటికీ తేలకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం రాత్రికిగాని, శుక్రవారంగాని దెందులూరు టిక్కెట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఉండిలోనూ వీడని సస్పెన్స్

ఉండి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిపై వినూత్న పరిస్థితి ఏర్పడింది. పొత్తులో భాగంగా ఉండి టిక్కెట్ టిడిపికి కేటాయించారు. అయినప్పటికీ ఈ స్థానం నుంచి ఆ పార్టీ తరపున ఎవరు పోటీ చేస్తారననే దానిపై స్పష్టత లేకుండాపోయింది. వైసిపి నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా పివిఎల్.నరసింహారాజు, కాంగ్రెస్ అభ్యర్థిగా వేగేశ్న గోపాలకృష్ణంరాజు, స్వతంత్ర అభ్యర్థిగా వేటూరి వెంకట శివరామరాజు ఎన్నికల బరిలో నిలిచి ప్రచారం ముమ్మరం ..6లో

నామినేషన్ వేస్తున్న వైసిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి ఆళ్ల నాని

తొలిరోజు 8 నామినేషన్లు

'పశ్చిమ'లో నరసాపురం ఎంపీ స్థానానికి ఒక నామినేషన్

ఏలూరు జిల్లాలో పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఆరు దాఖలు

తొలిరోజు వైసిపి, జనసేన, కాంగ్రెస్, ఇండిపెండెట్లు నామినేషన్లు

తొలిరోజు బోణి కొట్టని టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు గురువారం రెండు జిల్లాల్లోనూ ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం ఎంపీ స్థానానికి ఒకటి, ఏలూరు జిల్లాలో ఏలూరు ఎంపీ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్‌కు తన నామినేషన్ అందజేశారు. అభ్యర్థి నామినేషన్ పత్రాలను వెరిఫికేషన్ కౌంటర్, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్‌లో అన్ని అంశాలను అధికారులు పరిశీలించి అనుమతించారు. పశ్చిమలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

నరసాపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సూర్యనారాయణరెడ్డి

ఏలూరు జిల్లాలో ఏడు నామినేషన్లు

తొలిరోజు గురువారం ఏలూరు జిల్లాలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు ఆరు నామినేషన్లు వచ్చాయి. ఏలూరు ఎంపీ స్థానానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున మొండెం సంతోష్ కుమార్ తన నామినేషన్‌ను కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అందించారు. అసెంబ్లీ ..6లో



అభివాదం చేస్తున్న జగన్

జిల్లాలో ముగిసిన సిఎం బస్సుయాత్ర

తేతలి నుంచి ప్రారంభమై ఉమ్మడి తూర్పుగోదావరిలోకి ప్రవేశం

రోడ్‌షోలో పలువురిని పలుకరిస్తూ ముందుకు సాగిన జగన్

ప్రజాశక్తి - తణుకురూరల్

సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల బస్సుయాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో గురువారంతో ముగిసింది. కృష్ణా జిల్లాలో యాత్ర ముగిసిన అనంతరం సోమవారం సాయంత్రం రోడ్‌షోగా హనుమాన్‌జంక్షన్ మీదుగా ఏలూరు జిల్లాలోకి ప్రవేశించి ఏలూరు, గుండుగొలను, చేబ్రోలు మీదుగా ఉంగుటూరు మండలం నారాయణపురం సిఎం చేరుకున్నారు. సోమవారం రాత్రి నారాయణపురంలో సిఎం బస చేశారు. మంగళవారం ఉదయం పది గంటల తర్వాత నారాయణపురం నుంచి రోడ్‌షోగా సిఎం యాత్ర సాగింది. నిడమర్రు, గణపవరం, ఉండి ..6లో

కృష్ణా గోదావరి సంగమం.. హేలాపురి

మధ్యపేజీల్లో..

పట్టపగలే విద్యుత్ కాంతులు

2లో..

ఉపాధి హామీ నిధులు కూలీలకే వినియోగించాలి : వ్యకాస

8లో..

నిట్ డైరెక్టర్‌గా దిలీప్ నియామకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్ రెగ్యులర్ డైరెక్టర్‌గా నాగపూర్ ఎన్ఐటిలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ దిలీప్ ఆర్.పేష్వే నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన త్వరలో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి వ్యవహరించారని పేర్కొన్నారు.

21, 22 తేదీల్లో జిల్లాలో పవన్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 21న నరసాపురం విచ్చేయనున్నారు. కూటమి తరపున నరసాపురం జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరుతూ 21వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రసంగిస్తారు. దీనికి ముందు ఆయన భీమవరంలో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలోనూ పాల్గొనున్నారు. అలాగే 22న తాడేపల్లిగూడెం, ఉంగుటూరుల్లో పవన్ ప్రచారం నిర్వహించనున్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోషన్

'ఐయామ్ విత్ రోషన్ కుమార్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు తాటి మహీంద్ర సింహ ఆధ్వర్యంలో టిడిపి కూటమి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ చేతుల మీద 'ఐయామ్ విత్ రోషన్ కుమార్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇంటర్‌లో కైకరం విద్యార్థికి స్టేట్ 4వ ర్యాంకు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కైకరానికి చెందిన హనుమంతు అజయ్‌రాజు స్టేట్‌లో 4వ ర్యాంకు, ఏలూరు జిల్లాల్లో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.వి.శ్రీనివాస్, గ్రామస్థులు, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.


ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దింట్లమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో కొలువై ఉన్న శ్రీపెద్దింటి అమ్మవారి దేవస్థాన హుండీలను గురువారం లెక్కించారు. తనిఖీ అధికారి సుధాకర్ పర్యవేక్షణలో లెక్కించగా 55 రోజులకు గాను నగదు రూపంలో రూ.14,29,977, బంగారం 7 గ్రాముల 400 మిల్లీ గ్రాములు, వెండి 440 గ్రాములు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి.గోపాలరావు తెలిపారు. అర్చకులు, సిబ్బంది, కొల్లేరు గ్రామాల పెద్దలు లెక్కింపులో పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ కాంతులు..

రాత్రయితే కోతలు.. ఇదేంటని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వదాలిలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

విద్యుత్ కోతలతో ఒక పక్క జనం అల్లాడుతుంటే, మరోపక్క పట్టపగలు కూడా పలు గ్రామాల్లో వీధిలైట్లు నిరంతరాయంగా విద్యుత్తు కాంతులు విరజిమ్ముతున్నాయి. ఆరోజు, ఈ రోజు అనే తేడా లేకుండా నెలలు తరబడి వీధిలైట్లు పగలు కూడా వెలుగుతున్నాయి. మండలంలోని వడాలి, కాకరవాడ శివారు దేవరం గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. ఈ గ్రామాల్లో కొన్ని నెలలుగా వీధిలైట్లు పట్టపగలు విద్యుత్ కాంతులను విరజిమ్ముతున్నాయి. దేవరం గ్రామంలో అన్ని వీధుల్లో వీధిలైట్లు పట్టపగలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. నిరంతరాయంగా వీధి దీపాలు వె లుగుతుండడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వడాలి గ్రామ సచివాలయం బజారులో ఉన్న వీధిలైట్లు కూడా నెల తరబడి పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈ విషయాలు తెలిసినప్పటికీ తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పటికైనా గ్రామపంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నిరంతరాయంగా వెలుగుతున్న వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి, విద్యుత్‌ను ఆదా చేయవలసిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూగజీవాలకు తాగునీటి వసతి కల్పించాలి

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

తాగునీటి కోసం మూగజీవులు గ్రామాలలో ఇబ్బంది పడుతున్నాయని, జంతువులకు తాగునీటి వసతి కల్పించి, మూగ జీవులను ఆదుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం ఆయన దుగ్గిరాల గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీచేసి పశువుల తాగునీటి వసతి తొట్టెలను పరిశీలించారు. వేసవి తాకిడి ఎక్కువగా ఉండడం, భూగర్భ జలాలు తగ్గడం, గ్రామాలలో చెరువులు నిండుకుండడం, జనాభా పెరుగుదల, వారి అవసరాలు పెరగడం వల్ల నీటి సమస్య జటిలంగా మారిందని వాటి ప్రభావం మనుషులతో పాటు పశువులపై కూడా పడిందని అన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడం వలన మూగజీవులు ఇబ్బంది పడకుండా గ్రామాలలో పశువులకు తాగునీటి వసతి కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఉన్న అన్ని తాగునీటి తొట్టెలను పునరుద్ధరించి జంతువుల కోసం తాగునీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేయడం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా దుగ్గిరాల గ్రామం రావడం జరిగిందన్నారు. వేసవి ప్రణాళికలో భాగంగా చెత్త, ఎండుటాకులు, మురికితో నిండిన పశువుల తొట్టెలను శుభ్రపరచి నీటితో నింపాలని అన్నారు. లైవ్ స్టాక్ రికార్డు ప్రకారం జిల్లాలో రెండు లక్షల ఆవులు, ఐదు లక్షల గేదెలు, ఐదున్నర లక్షల గొర్రెలు, రెండు లక్షల మేకలు ఉన్నాయని గుర్తుచేస్తూ పాడి పశువులు మనజాతి సంపదని, పల్లె సంస్కృతిలో భాగమైన పశువులను సంరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లాలో ఉన్న 500 పశువుల తాగునీటి తొట్టెలను రెండు రోజులలో పునరుద్ధరించి మూగ జీవులకు తాగునీటి వసతి కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, డిపిఎం పులి సత్యనారాయణ ఉన్నారు.

20న నామినేషన్ వేస్తా..

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు

చింతలపూడి: మన జెండా ఒక్కటే, మనమంతా ఒక్కటే, మన నాయకుడు ఒకే ఒక్కడు జగన్మోహన్ రెడ్డి, ఎన్నికల అనంతరం ఐదేళ్ల మనమంతా ఇలాగే కలిసికట్టుగా ముందుకు సాగాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయ రాజు అన్నారు. చింతలపూడి పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 20వ తేదీన చింతలపూడి ఎంఆర్ఒ కార్యాలయంలో తాను నామినేషన్ వేస్తున్నట్లు విజయ రాజు చెప్పారు. ఈ నామినేషన్‌కు చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న ప్రతి కార్యకర్త, నాయకులు స్వచ్ఛందంగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన మంచి పనుల వల్ల పార్టీకి ఎంతో ఆదరణ ఉందని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేస్తే జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఇకపై ప్రతి కార్యకర్త ఒక సైనికుల్లా పనిచేసి విజయానికి తోడ్పడాలన్నారు. తమ కోసం తాను అహర్నిశలు పనిచేసే సేవకుల్లా ఉంటానని చెప్పారు.

25న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్, అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి.ఎస్.బి శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల ప్రవేశానికి ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ డిగ్రీ కళాశాల ప్రవేశానికి మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జిల్లా కేంద్రం ఏలూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో ఈనెల 17వ తేదీ నుంచి అభ్యర్థులు తమ ఐడీ, పుట్టిన తేదీ ద్వారా వెబ్ సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. హాల్ టికెట్లు పోస్టు ద్వారా పంపించబడునని అన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లతో తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని ఆయన తెలిపారు.

మహారాజశ్రీ నిడదవోలు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు నందు
O.S. No. 04/2023

Between:
నరమామిడి కోట సత్యవతి ...వాది
మరియు
నరమామిడి సూర్య తరుణ్ జీ ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన నరమామిడి సూర్య తరుణ్ జీ కి రిజిస్టర్ పోస్ట్ మరియు కోర్టు వారి ద్వారా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు సబ్సిట్యూటెడ్ సర్వీస్ ద్వారా ది. 29-04-2024వ తేదీన వాయిదా అయి ఉన్నదని ఆరోజు ఉదయం 10:30 గంటలకు, నరమామిడి సూర్య తరుణ్ జీ S/o. గంగారావు, వయస్సు 21 సంవత్సరాలు, హిందూ, మేల్, R/o. శుభద్ర రెసిడెన్సీ, భీమవరం టౌన్ మరియు మున్సిపాలిటీ, పశ్చిమగోదావరి జిల్లా, అనువారు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ నిడదవోలు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు నందు హాజరు కావలెను ఉన్నదని, అలా కాని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఎస్. కాశీ విశ్వేశ్వరరావు
న్యాయవాది, నిడదవోలు
సెల్: 8978554125

నేడు ఇండియా వేదిక అభ్యర్థి నామినేషన్

కైకలూరు: ఈనెల 19వ తేదీ ఉదయం 10.30 నిమిషాలకు కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు బొడ్డు నోబుల్ గురువారం తెలిపారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన చెప్పారు.

సర్వోదయ సమ్మేళనం సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

సర్వోదయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

మండలంలోని నాచుగుంటలో సర్వోదయ స్థూపం వద్ద గురువారం అఖిల భారత 13వ సర్వోదయ సమ్మేళనం జరిగిన స్థలం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. భూదానోద్యమానికి మద్దతుగా దేశవ్యాప్తంగా సర్వోదయ సమ్మేళనం మహాసభలు జరిపేవారు. ఈక్రమంలో 1965 ఏప్రిల్ 18, 19, 20వ తేదీల్లో సర్వోదయ నాయకుడు, మాజీ మంత్రి కీర్తిశేషులు చింతలపాటి మూర్తిరాజు సారథ్యంలో నాచుగుంటలో 13వ సమ్మేళనం చలువ పందిర్లు వేసి మూడు రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఆనాటి జ్ఞాపకాలను నేటితరం వారికి తెలియజేయడం కోసం సంస్మరణ కార్యక్రమాలు చేసి గాంధేయవాదులు, సంఘ, సమాజ సేవకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సేవా తత్పరులను జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందజేయడం పరిపాటిగా వస్తోంది. స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సర్వోదయ మండలి నాయకులు ఇందుకూరి ప్రసాదరాజు, కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, సాగిరాజు జానకీరామరాజు, ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత సురేష్ పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

నా క్లయింటు శ్రీమతి నిమ్మకాయ్ల కల్పన గారు ఇచ్చిన సమాచారము ప్రకారం తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు శ్రీమతి కుందేటి అంజలి గారి దగ్గర నుంచి 227.77 చ॥గ॥ స్థలము ప్లాట్ నెం. 17, ఆర్.ఎస్. నెం. 121, పి.ఆర్. నెం. 38ఎ, 'డి' బ్లాక్‌లోని స్థలమును క్రయ దస్తావేజు నెం. 11421/2021 గా క్రయమును పొంద తలచి వారి హక్కు భుక్తములలో ఉన్న ఆస్తియై యున్నదనిన్నీ మరియు సదరు శ్రీమతి అంజలి గార్కి వారి తల్లి గారు వ్రాసిన దఖలు దస్తావేజు నెం. 2606/2017 ద్వారా సంక్రమించిన ఆస్తియై ఉన్నది. సదరు లింకు దాక్యుమెంటు నెం. 2606/2017 జిరాక్సు నిమిత్తం తీసుకొని వెళుతుండగా మార్గ మధ్యములో పోయినదనిన్నీ చెప్పియున్నారు. కావున సదరు దాక్యుమెంటు ఎవ్వరికైననూ దొరికిన యెడల క్రింది అడ్రసు వార్కి తెలియపర్చగలరు.

బేతిన భానుప్రకాష్, అడ్వకేట్
కట్ట సుబ్బారావు వీధి
రామచంద్రరావుపేట, ఏలూరు
సెల్: 9177075847

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 377/2023

బిట్వీన్:
శ్రీ బత్తుల వెంకట్రావు -వాది
మరియు
శ్రీమతి మణిపూరి మాణిక్యం -ప్రతివాది

ప్రతివాది: శ్రీమతి మణిపూరి మాణిక్యం, W/o. సత్యనారాయణ, డోర్ నెం. 9-2-41, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం - 534101, సెల్: 9494343886.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు వారి ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికీ వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం ది. 03-05-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది:18-04-2024 సెల్: 9290188928

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 374/2023

బిట్వీన్:
శ్రీమతి దాసరి రామలక్ష్మి -వాది
మరియు
శ్రీమతి మణిపూరి మాణిక్యం -ప్రతివాది

ప్రతివాది: శ్రీమతి మణిపూరి మాణిక్యం, W/o. సత్యనారాయణ, డోర్ నెం. 9-2-41, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం - 534101, సెల్: 9494343886.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు వారి ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికీ వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం ది. 03-05-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది:18-04-2024 సెల్: 9290188928

నిరుపయోగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అందుబాటులోకి తేవాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని పంగిడిగూడెం రోడ్‌లో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎటువంటి సేవలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా ఉండడంతో స్థానిక ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేశాం అని చెప్పుకుంటున్నా.. అది మాటలకే పరిమితమైందని, పంగిడిగూడెం రోడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభమై గత ఆరు, ఏడు నెలలు గడుస్తున్నా కనీస అవసరాలకు ఉపయోగపడకుండా ఎప్పుడు చూసినా తాళాలకే పరిమితమై ఉంటుందని, అందుబాటులోకి వస్తుందా? లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇక్కడ ఉన్నటువంటి ఏరియా ఆసుపత్రికి వెళ్లాలంటే చిన్నపిల్లలు, ముసలి

నిరుపయోగంగా ఉన్న పిహెచ్‌సి

వారితో చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. కనీసం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇకనైనా ఇక్కడున్న ప్రజలకు దగ్గర్లో చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ ప్రారంభమై ఆరేడు నెలలు గడుస్తున్నా ప్రజలకు వైద్య సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలం అయ్యారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏవిధమైన సేవలకు నోచుకోకుండా నిరుపయోగంగా పడి ఉండడాన్ని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి అంతా వట్టి మాటలకే మాటలకే పరిమితం తప్ప ప్రజలకు వైద్య సదుపాయాన్ని, దగ్గరలో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులోకి తీసుకురాలేకపోతుందని విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపించి నిరుపయోగంగా పడి ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను ప్రారంభించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని స్థానిక జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'డాక్టర్ మోహన్ నేటి యువ వైద్యులకు ఆదర్శం'

నూజివీడు రూరల్: నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెంట్‌గా విధులు నిర్వర్తించిన ఆర్తో సివిల్ సర్జన్ డాక్టర్ ఎవిఆర్ మోహన్ దంపతులను వైద్య సిబ్బంది గురువారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మార్చి 31వ తేదీన స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన డాక్టర్ ఎవిఆర్ మోహన్ నేటి యువ వైద్యులకు ఆదర్శప్రాయం అన్నారు. ఎముకల విభాగంలో ఆయన చేసిన సేవలు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు 'మానవత' సాయం

పోలవరం: పోలవరం పంచాయతీ గణేశ్ నగర్ యానాది కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన కుటుంబాలకు గురువారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గృహోపకరణాలు సహాయంగా అందించారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు గణేశ్ మాస్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు మండలంలో పలువురు మానవత్వంతో సహాయం అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా ప్రెసిడెంట్ గణేష్ మాస్టర్, ఉపాధ్యక్షులు పూనం పోసిబాబు, కార్యదర్శి కె.రాంబాబు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్ పరిశీలన

జీలుగుమిల్లి: మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద గల ఎస్ఎస్‌టి చెక్ పోస్ట్‌ను గురువారం ఎన్నికల పరిశీలకులు మేశ్రం గౌరవ్ మధుకర్ తనిఖీ చేశారు. చెక్ పోస్ట్‌లో పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరు గురించి ఆరా తీశారు. అనంతరం చెక్ పోస్ట్ వద్ద నమోదు కాబడిన కేసుల గురించి చెక్‌పోస్ట్ ఇన్‌ఛార్జి నిఖిల్ మధు శరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్ట్ వద్ద సిబ్బంది 24 గంటలపాటు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి, చెక్ పోస్ట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలోకి పలువురు

కామవరపుకోట: మండలంలోని ఈస్ట్ ఎడవల్లి పంచాయతీ నల్లగోపు వారి గూడెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, జనసేన నాయకులు కరాటం రాంబాబు, మేక ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సుమారు 300పైన కుటుంబాలు జనసేనలోకి చేరారు. కూటమి విజయాన్ని ఏ శక్తి ఆపలేదన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ హబీబ్ భాషా

ప్రజాశక్తి - భీమడోలు

భూసారం పెంచేందుకు సహకరించే పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందించేందుకు వ్యవసాయ శాఖ సన్నాహాలు చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ హబీబ్ భాషా తెలిపారు. ఆయన గురువారం భీమడోలు మండలంలో పర్యటించారు. జాతీయ రహదారిపై గుండుగొలను వద్ద రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులతో ఆయన మాట్లాడారు. నిర్ణీత షరతుల మేరకు ధాన్యం కొనుగోలు అంశాల గురించి రైతులతో చర్చించారు. ధాన్యం తరలింపు, రవాణా, తేమ శాతం లెక్కింపు, ఇతరాలను రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగు ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. ఈమేరకు రైతులకు సహకరించేందుకు ముఖ్యంగా బోర్ల కింద సాగు చేసే రైతులకు సహకరించేందుకు వ్యవసాయ శాఖ రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. వీటిలో కొన్ని రకాలను వరి కోతలకు వారం ముందుగా, కొన్ని రకాలను వరి కోతల తర్వాత వ్యవసాయ క్షేత్రంలో వెదజల్లడం ద్వారా సాగు చేయవచ్చని సూచించారు. పచ్చిరొట్ట సాగు ద్వారా భూసారం పెంచేందుకు అవసరమైన ఎరువులు వ్యవసాయ క్షేత్రానికి నేరుగా అందుతాయని వివరించారు. జిల్లా

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

పరిధిలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు, భీమడోలు మండలాలలో ఇంతవరకు అత్యధికంగా ధాన్యం సేకరణ జరిగిందని వివరించారు. భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతున్నట్టు తెలిపారు. ఇంతవరకు మండలంలో 8,783 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయన్నారు. 9,830 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించినట్లు చెప్పారు. రైతుల అవసరాల మేరకు సదరు రైతు భరోసా కేంద్రాల వద్ద ఆరు లక్షల గోనె సంచెలు ఇప్పటికే అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సాంకేతిక వ్యవసాయ అధికారి ప్రవీణ్‌తో పాటు రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన అగ్నిమాపక వారోత్సవాలు

మొగల్తూరు: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆ శాఖ అధికారి కె.భాస్కరరామ్ ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం మొగల్తూరులోని నల్లవారి తోటలో ఉన్న ఆనంద ఫ్యాక్టరీలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంట గ్యాస్ సిలీండర్ లీక్ అయినప్పుడు జరిగిన ప్రమాదాన్ని ఎలా అరికట్టాలో ప్రజలకు అవగాహన కల్పించి చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

భీమడోలు: ఫ్యాక్టరీలలో అగ్ని ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు ముందస్తు సన్నాహాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒకవేళ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూసేందుకు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భీమడోలు ఫైల్ ఆఫీసర్ జి.నాగరాజు కోరారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం భీమడోలు సమీపంలోని సింగవరం గ్రామంలోని తిరుమల మిల్క్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు బాధితులను రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై డెమో కార్యక్రమాన్ని అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది, ఫ్యాక్టరీ సిబ్బంది సహకారంతో చేపట్టారు. ఇదేక్రమంలో రసాయన ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవలసిన రక్షణ చర్యలు, ఫ్యాక్టరీ ఆవరణలో విద్యుదీకరణ పనులు చేపట్టినప్పుడు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల మిల్క్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సువిధ ద్వారా 1625 అభ్యర్థనలకు అనుమతులు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇఎస్ఎంఎస్ కింద చేబట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.13.20 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇందులో రూ.176.54 లక్షలు నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.120.47 లక్షల విలువైన మద్యం స్వాధీన పరచుకున్నారన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకూ 1625 అనుమతులు ఇవ్వటం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 1662 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 1625 అనుమతులు జారీ చేయగా, మరో 37 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ప్రేమ పేరుతో మోసం..

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - కామవరపుకోట

రావికంపాడు గ్రామానికి చెందిన బొబ్బిలి లీల కిరణ్ కుమార్(24) వ్యవసాయ కూలీ పనులు చేస్తు జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఒక యువతి సంవత్సరం కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇదే క్రమంలో గత సంక్రాంతి పండుగకు సెలవులకు ఇంటికి వచ్చిన యువతకి మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకుని ఇప్పుడు సదరు యువతితో పెళ్లికి నిరాకరించాడు. సదరు యువతి మైనర్‌గా ఉన్నపుడు కూడా లీల కిరణ్ కుమార్ ఆమెను లోబర్చుకున్నట్లు సదరు యువతి పోలీసులకి తెలిపింది. దీంతో సదరు యువకుడుపై పోక్సో, రేప్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉండి మండలం చిలుకూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు శివారులో మహదేవపట్నం గ్రామానికి చెందిన గుగ్గిలపు శ్రీనివాస్ రొయ్యల చెరువు పట్టుబడికి ఉండి గ్రామానికి చెందిన సింగూరి నాగరాజు(40)తో కలిసి వెళ్లగా చెరువు గట్టు మీద ఉన్న ఎర్త్ వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడని తోటి కూలీలు నాగరాజు భార్య మంగకు తెలిపారు. నాగరాజుకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. నాగరాజు భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీస్ స్టేషన్ రైటర్ యేసయ్య అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని సిర్రివారిగూడెం గ్రామ శివారులో గురువారం కోడి పందేల శిబిరంపై దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సిర్రివారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేయగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,880 నగదు, ద్విచక్ర వాహనం, కోడి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి మోటార్ సీజ్ : పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోటలో అనధికారికంగా తాగునీటిని పరిశ్రమకు మళ్లిస్తున్న విషయమై ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన 'దర్జాగా నీటి చౌర్యం' అనే వార్తకు అధికారులు గురువారం స్పందించారు. చిగురుకోట పరిశ్రమకు తాగునీటిని మళ్లిస్తున్న ప్రాంతాన్ని అధికారుల బృందం ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధర్ రావు ఆధ్వర్యంలో పర్యటించారు. అధికారులు మోటర్ల ద్వారా నీటిని మళ్లిస్తున్న కాలువగట్టు వద్దకు వెళ్లేసరికి, అప్పటికే నాలుగు కరెంట్ మోటర్లు ఏర్పాటు చేసిన వ్యక్తి వాటిని అక్కడనుంచి తొలగించి పరారయ్యాడు. అలాగే పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన మూడు మోటార్లను తొలగించి వేశారు. అయితే అక్కడే ఉన్న సెంటినీ సిరామిక్‌కు చెందిన 5 హెచ్‌పి విద్యుత్ మోటార్‌ను అధికారులు సీజ్ చేశారు. ఆ మోటర్‌ను చిగురుకోట గ్రామపంచాయతీ కార్యాలయంకు తీసుకువచ్చి పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్‌కు అప్పగించారు. అనాధికారికంగా నీటిని తోడుతున్న ప్రాంతం మండవల్లి మండల పరిధి కావడంతో పోలీసులకు ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ అధికారుల పర్యటనలో పోలరాజ్ కెనాల్ ఎఇఇ వివి కిషోర్, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజ్ చేసిన విద్యుత్ మోటార్

వెలుగు సిసి గుండెపోటుతో మృతి

కామవరపు కోట: వెలుగు డిపార్ట్మెంట్‌లో సిసిగా పనిచేసే ఉద్యోగి మృతి చెందిన సంఘటన కామవరపుకోటలో చోటు చేసుకుంది. సహోద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం వెలుగు డిపార్ట్మెంట్ సిసి తానంకి నారాయణరావు బుధవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వెళ్లి తిరుగు ప్రయాణంలో హార్ట్ అటాక్ రావడం వల్ల మృతి చెందారు. డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయ రాజు నారాయణ రావు భౌతిక దేహాన్ని సందర్శించి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.20 వేలు అందజేశారు.

నామినేషన్ పత్రం.. జరభద్రం..

ఎన్నికల క్రతువులో అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. అభ్యర్థుల నుంచి నామినేషన్‌పత్రాలు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సాధారణ రోజుల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈనెల 25 మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26న నామినేషన్లను పరిశీలిస్తారు. 29 వరకు నామినేషన్ పత్రాలను అభ్యర్థులు ఉపసంహరించుకునే వకాశముందని ఎన్నికల అధికారులు తెలిపారు. అదేరోజు ఆయా నియోజకవర్గాల్లో ఎంతమంది బరిలో నిలుస్తారనే అంశం తేలుతుంది.

అర్హతలు..

- నామపత్రాలు దాఖలుచేసే అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు ఉండాలి.
- రాష్ట్రంలోని ఏదేని నియోజకవర్గంలో ఓటుహక్కు
- అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తులు సదరు నియోజ కవర్గానికి చెందిన వారై ఉండాలి.
- జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీచేసేవారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థిని పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ధరవాతు సొమ్ముగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ. 5వేలు, మిగతా అభ్యర్థులు రూ.10వేలను చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సంబంధిత అధికారి నుంచి పొందిన కుల ధ్రువపత్రాలు సమర్పించాలి.
- అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. అందులో నుంచే ఎన్నికలకు ఖర్చు చేయాలి. సంబంధిత వివరాలను ఆర్‌ఒకు సమర్పించాలి.

రిటర్నింగ్ అధికారి నుంచి పొందాల్సిన పత్రాలు

- ఎన్నికల వ్యయాలను నమోదుచేసే రిజిస్టర్
- పరిశీలనకు హాజరయ్యేందుకు నోటీసు
- చెల్లించిన మొత్తానికి రసీదు.
- ప్రమాణం చేసిన ధ్రువీకరణ పత్రం.
- కరపత్రాలు, గోడపత్రికలు తదితర వాటిని ముద్రించేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-127(ఎ) సంబంధిత సూచనల పుస్తకం.
- నామినేషన్లోని లోపాలను జతపర్చాల్సిన పత్రాల సూచిక..

అన్ని కాలమ్స్ పూరించాల్సిందే..

నామినేషన్ అనేది అభ్యర్థి పోటీలో ఉంటారా? లేదా అనే నిర్ణయించే ప్రక్రియ. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లో అస్తులు, అప్పులు, రాబడి, ఖర్చులు, క్రిమినల్ కేసుల వంటి వివరాలు నమోదు చేయాలి. అడిగిన వివరాలు వర్తించకపోతే "నాట్ ఆప్లికబుల్" అని రాయాలి, అఫిడవిట్లోని కాలమ్స్ అన్నీ తప్పనిసరిగా పూరించాలి. లేనిపక్షంలో సదరు అభ్యర్థికి ఆర్‌ఒ నోటీసులు జారీ చేస్తారు. నామినేషన్ల పరిశీలన తేదీ కంటే ముందుగానే అన్ని కాలమ్స్ పూర్తి చేయిస్తారు. ఖాళీగా ఉంచితే నామినేషన్‌పత్రం తిరస్కరణకు గురవుతుంది.

ఎన్నికల నిబంధనలు ఇలా..

- అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామపత్రాలు (ఫా-2బీ) సమర్పించవచ్చు.
  దీనికి రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కలిగిన ఫాం- 26 ద్వారా ప్రమాణ పత్రం(అఫిడవిట్) జతపర్చాలి.
- అఫిడవిట్‌ను నోటరీ చేయించాలి.
- నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. స్వతంత్ర అభ్యర్థితో పది మంది వెళ్లవచ్చు.
- నామినేషన్‌పత్రం సమర్పించే సమయంలో అభ్యర్థి ప్రమాణం చేయాల్సి ఉంటుంది.

ఇలాగైతే తిరస్కరణే...

నామినేషన్లను తిరస్కరించే అధికారం అధికారులకు ఉంటుంది. నామేషన్‌పత్రాలను సక్రమంగా పూరించక పోయినా, అసంపూర్తి సమాచారమిచ్చినా, సంతకం మారిపోయినా, పార్టీ బీ-ఫాం దక్కకపోయినా తిరస్కరించవచ్చు. గుర్తింపు పొందిన పార్టీ నుంచి అభ్యర్థి నామినేషన్ వేస్తే సదరు పార్టీ బీ-ఫాం ఇవ్వకపోయినా అప్పటికే తనను పది మంది ప్రతిపాదించి ఉంటే ఆయన లేదా ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయటానికి అర్హులవుతారు.

ఆన్‌లైన్‌ద్వారా..

ఈసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో నామినేషన్ సమర్పించే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో మొదట 'సువిధ యాప్'లో ఎన్నికల సంఘం నియమాల ప్రకారం వివరాలు నమోదు చేయాలి. అనంతరం సదరు అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నుంచి అపాయింట్‌మెంట్ తేదీ వస్తుంది. అప్పుడు అభ్యర్థి లేదా ప్రతిపాదించే వ్యక్తులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్‌పత్రాల వివరాలతో కూడిన ధ్రువపత్రాలను అధికారికి అందించాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన బందోబస్తు...

నామినేషన్ స్వీకరణ కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ ర్యాలీలు, వాహనాలను నిలిపివేయాలి. అభ్యర్థితో పాటు మూడు వాహనాలను మాత్రమే కార్యాలయం ప్రాంగణం వరకు అనుమతిస్తారు.

నేరచరిత్ర చెప్పాల్సిందే..

అఫిడవిట్లో అభ్యర్థి నేర చరిత్రను ప్రస్తావించాల్సి ఉంటుంది. ఫాం- సీ1 ద్వారా రాజకీయ పార్టీలు, ఫాం సీ 2 ద్వారా అభ్యర్థులు వేర్వేరుగా పేరొందిన వార్తపత్రికల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది. స్వతంత్రులైతే వ్యక్తిగతంగా నేరచరిత్రను ప్రకటించాలి. ఇదే ఆపిడ విట్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో ఉంచుతారు. అందులోని వివరాలు సవ్యంగా లేకపోతే. సదరు అభ్యర్థి ఎన్నికను న్యాయ స్థానంలో సవాలు చేయవచ్చు.

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ఆర్‌డిఒ శీనివాసులు రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ శాసనసభకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి నేరుగా గానీ ప్రతిపాదితోగానీ నేటి నుంచి 25వ తేదీ గురువారం వరకూ నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కాకుండా ఏ రోజైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు భీమవరం మున్సిపల్, ఆర్‌డిఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి, తహాశీల్దార్‌కు గాని నామినేషన్లు అందించవచ్చని తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ల పత్రాలను పొందొచ్చన్నారు. మే 13న ఉదయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

సార్వత్రిక సంగ్రామం

కృష్ణా గోదావరుల సంగమ స్థలం హేలాపురి. చుట్టూ పచ్చని పొలాలు, మధ్యలోంచి ప్రవహించే తమ్మిలేరు, లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు కేంద్ర స్థానంగా ఉన్న ఏలూరు శతాబ్దాల చరిత్రను తనలో ఇముడ్చుకుంది. గాంధీ నడయాడిన నేల ఇది. గాంధీజీ చేపట్టిన ఉద్యమాలకు మద్దతుగా బంగారు ఆభరణాలు తీసి ఇచ్చిన వీరవనితలు పుట్టిన ఈ గడ్డ రాజకీయాలకు కేంద్ర బిందువు. రాజుల కాలంలోనే వేంగీ కళావైభవానికి ప్రతీకగా నిలిచిన హేలాపురి.. జిల్లాకు మణిహారమే..

కృష్ణా, గోదావరుల సంగమం.. హేలాపురి..

జిల్లా రాజకీయాలకు కేంద్రబిందువు

ఆసక్తికరంగా హేలాపురి చరిత్ర

మరడానికే మంత్రి పదవి

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఆదిలో ఏలూరు పట్టణంతోపాటు, గ్రామీణ మండలంలోని 22 గ్రామాలు ఉండేవి. పునర్విభజన తర్వాత ఏలూరు నగరంతోపాటు, వెంకటాపురం, సత్రంపాడు, శనివారపుపేట, కొమడవోలు, పోణంగి, చొదిమెళ్ల, తంగెళ్లమూడి పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాలు కూడా ఇటీవల ఏలూరు నగరంలో విలీనమయ్యాయి. కృష్ణా, గోదావరి కాలువలు కలిసేది కూడా నగరంలోనే. 1952 నుంచి ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మరడాని రంగారావు, ఆళ్ల కాళీకృష్ణశ్రీనివాస్ (నాని) రెండుసార్లు చొప్పున గెలుపొందారు. నియోజకవర్గం నుంచి మరడాని రంగారావు ఒక్కరే మంత్రి పదవి చేపట్టారు. ఎన్‌టిఆర్ మంత్రివర్గంలో ఆయన మంత్రిగా పని చేశారు.

స్వతంత్ర అభ్యర్థికే అత్యధిక మెజార్టీ

ఏలూరు నియోజకవర్గ పరిధిలో 13 సార్లు ఎన్నికలు జరగ్గా అనేక మంది పోటీలో నిలిచారు. విజయం సాధించిన వారిలో 1983లో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన చెన్నకేశవుల రంగారావు సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పుల వెంకట సత్యనారాయణపై 47,515 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇదే ఇప్పటి వరకూ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ. 1985లో మరడాని రంగారావు 20,040 ఓట్ల మెజార్టీ సాధించారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ సమీప టిడిపి అభ్యర్థి మరడాని రంగారావుపై 33,063 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

సంవత్సరం	విజేత	పార్టీ
1952	జి.సత్యనారాయణ	సిపిఐ
1955	శీర్ల బ్రహ్మయ్య	కాంగ్రెస్
1962	ఎ.సర్వేశ్వరరావు	సిపిఐ
1967	ఎం.వెంకటనారాయణ	కాంగ్రెస్
1972	ఎ.శ్రీరాములు	స్వతంత్ర
1978	ఎన్.సూర్యప్రకాశరావు	కాంగ్రెస్
1983	చెన్నకేశవుల రంగరావు	స్వతంత్ర
1985	ఎం.రంగారావు	టిడిపి
1989	నేరేళ్ల రాజా	కాంగ్రెస్
1994	మరడాని రంగారావు	టిడిపి
1999	అంబికా కృష్ణ	టిడిపి
2004	ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)	కాంగ్రెస్
2009	ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)	కాంగ్రెస్
2014	బడేటి బుజ్జి	టిడిపి
2019	ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)	వైసిపి

చారిత్రక ప్రాశస్త్యం..

ప్రాచీన శాసనాలను అనుసరించి ఒకప్పుడు ఏలూరును 'ఏళూరె'గా పిలిచేవారని



తెలుస్తోంది. వేంగీచాళుక్యుల కాలంలో ప్రాచీన ఆలయాలను చాలా నిర్మించారు. 14వ శతాబ్దం నాటి హజ్రత్‌పాషా షహీద్ మహాత్ముల వారి దర్గా ఏలూరులోని దక్షిణపువీధిలో ఉంది. పడమరవీధిలోని దొంగల మండపంగా పిలుస్తున్న చోరోత్సవ మండపం ప్రాచీన వైభవాన్ని సంతరించుకుంది. తూర్పువీధిలో శివయ్యబడి వీధిలో 400 ఏళ్లనాటి కేవలం మూడడుగుల ఎత్తయిన నమూనా మసీదు, హిందూ ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. 18వ శతాబ్దంలో ఏలూరులో అలెగ్జాండర్ ఆధ్వర్యంలో స్థాపించిన సిఎస్‌ఐ చర్చి, స్కూలు, ఫిల్‌హౌస్‌పేటలోని సిఎస్‌ఐ చర్చిలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. శనివారపుపేటలో వేంగీచాళుక్యుల కాలం నాటి చెన్నకేశవ రామలింగేశ్వరస్వామి ఆలయం, గాలిగోపురం అత్యంత ప్రాచీన వైభవంతో జిల్లాకే తలమానికంగా నిలుస్తోంది. పోణంగిలోని వైనతేయుశ్వరస్వామి ఆలయం 10వ శతాబ్దానికి చెందిన ప్రాచీన నిర్మాణం.

ప్రముఖులెందరికో నిలయం

1876-1943 మధ్య కాలంలో లక్కవరం జమిందారు రాజా మంత్రి ప్రగడ భుజంగరావు ఏలూరు సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళలను పోషించారు. ఆయన హయాంలో ఏలూరు హేలాపురిగా వెలుగొందింది. ఎన్నో గ్రంథాలు రచించారు. మోతే నారాయణరావు నాటక సమాజం స్థాపించి నటులను, నాటకకర్తలను పోషించారు. రంగస్థల కళాపోషకుడు బందా కనకలింగేశ్వరరావు ఇక్కడివారే.

1902లో హిందూ సుందరి పేరిట మహిళల కోసం పత్రిక నడిపారు. సంపాదకురాలు మొగలిగంటి రామబాయమ్మ ఏలూరువాసే. ఆత్మకూరి గోవిందాచార్యులు 1921లో సత్యాగ్రహి పత్రికను గాంధీ ఆంధ్రజాతీయ మహావిద్యాలయంలో నడిపారు. స్వాతంత్రోద్యమకాలంలో మహాత్మాగాంధీ ఏలూరు మూడుసార్లు విచ్చేశారు.

విఖ్యాత ఎంకిపాట కవి నండూరి సుబ్బారావు 1895-1957 మధ్యకాలంలో ఏలూరు ఉండేవారు. శివరాజు వెంకటసుబ్బారావు (బుచ్చిబాబు) నవలలు, కథలు రాశారు.

1885-90లో వామనబట్టి జోషి, సీతారాంజోషిలు హిందీ నాటకాలను ప్రప్రథమంగా ప్రదర్శించారు. చాటపర్రు బాలా త్రిపురసుందరి, కందికట్టు మాణిక్యం, చదలవాడ సామ్రాజ్యం, బండి విరాజితం వంటి దక్షిణభారత దేశంలోనే ఖ్యాతి గడించిన ప్రఖ్యాత నాట్య కళాకారిణులు ఏలూరుకు చెందినవారే.

'రావోయి బంగారుమామ' మొక్కజొన్నతోటలో.. పాట రచయిత కొనకళ్ల వెంకటరత్నం (1909-1970) ఏలూరుకు చెందిన వారే. 1910లో సత్తిరాజు సీతారామయ్య దేశోపకారి పత్రిక నడిపారు. 1945లో స్వాతంత్రోద్యమ కాలంలో సుభాష్ చంద్రబోస్ నగరానికి విచ్చేసి ఎఎస్‌ఆర్ స్టేడియం ఉన్న ప్రాంతంలో ప్రసంగించారు. దండు నారాయణరాజు ఉప్పు సత్యాగ్రహం ఇక్కడి నుంచే ప్రారంభించారు.

నాటి ప్రఖ్యాత సినీనటి కన్నాంబ ఏలూరు వాస్తవ్యురాలు.

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వాది సుబ్బారావు ఏలూరుకు చెందినవారే.

వైసిపి పాలనతో విసుగు

టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్ర ప్రజలంతా విసుగెత్తిపోయారని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. అత్తిలి, దువ్వ, వరిఘేడు గ్రామాలకు చెందిన అనేక మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేశాసి రాధాకృష్ణను కలిసి టిడిపిలో చేరతామని సంసిద్ధత వ్యక్తం చేశారు. వారందరికీ పసుపు కండువా కప్పి టిడిపిలోకి రాధాకృష్ణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి విధానాలతో, ముఖ్యంగా తణుకు ఎంఎల్ఎ కారుమూరి నాగేశ్వరరావు నియంత పోకడలతో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. రాబోయే కాలంలో టిడిపిలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని, ప్రజలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పితాని మోహన్, కట్టా సూర్యారావు, మంగ ఇమ్మానుయేల్, శ్రీనివాసరావు, కరుటూరి సర్వేశ్వరరావు, కోణాల మల్లికార్జునరావు, ఏరుబడి సత్యనారాయణ, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమితోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా : నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నవ్యాంధ్ర పునర్నిర్మాణం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు పునాది రెండూ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. సత్రంపాడు 22వ డివిజన్‌లో నిర్వహించిన సంకల్పయాత్రలో బడేటి చంటి పాల్గొన్నారు. స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకందించి, ఆయా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పయాత్రలో భాగంగా ప్రజలను కలుస్తున్న సందర్భంలో వారు చెప్పుకుంటున్న సమస్యలు వింటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే సందేహం కలుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమికి సంపూర్ణ ప్రజామద్దతు దక్కుతుందని బడేటి చంటి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన నగర అధ్యక్షులు నాగిరెడ్డి కాశీ నరేష్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని జనసేన నేత, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు తెలిపారు. మండలంలోని కొత్తపాలెంలో మన కోసం మన నాయకర్ కార్యక్రమంలో భాగంగా జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కొల్లాటి గోపీకృష్ణ, నిప్పులేటి తారక రామారావు, కొత్తపల్లి రాంబాబు, జనార్ధన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నరసాపురం : జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ గెలుపు కోసం నేతలందరూ కష్టపడుతున్నారు. మండలంలోని పసలదీవి గ్రామంలో నాయకర్‌తో పాటుగా మాజీ మంత్రి జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బరాయుయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి కన్వీనర్ మేకల సతీష్ ప్రచారం చేపట్టారు. గొందిలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి సూర్య కుమారి లంకలకోడేరులో ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే రామానాయుడును గెలిపించుకునేందుకు సైకిల్ గుర్తుపై ఓటేయాలన్నారు. కార్యక్రమంలో చొప్పల రజిని, ఆకుల ధనలక్ష్మి, పెనుమత్స సత్యనారాయణ రాజు, నెక్కంటి ఆదినారాయణ, చాగంటి అన్నవరం, ఆదూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్‌కు మరో ఛాన్స్ ఇస్తే రాష్ట్రం ఉండదు

ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం జగన్ ఒక్క ఛాన్స్ అడిగి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మరో ఛాన్స్ ఇస్తే రాష్ట్రమే ఉండదని చెప్పారు. పదేళ్లుగా పాలకొల్లు ఎంతో అభివృద్ధి చెందిందని మరో అవకాశం ఇస్తే పెండింగ్ పనులు పూర్తి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని చెప్పారు. వరదలు, కరోనా వంటి సమయంలో సేవ చేసే స్థానికులను ఎన్నుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ప్రభుత్వాసుపత్రికి రూ.12.5 కోట్ల నిధులు తెచ్చానని, ఐదేళ్లుగా దీన్ని వైసిపి పూర్తి చేయలేకపోయిందని తెలిపారు. దీని నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

లిఖితపూడిలో ప్రసాదరాజు తనయుడు ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

నా తండ్రి చేసిన కృషికి ఒక ఆక్వా రైతుగా ఈ యూనివర్సిటీ నర్సాపురం రావడం చాలా సంతోషంగా ఉందని ముదునూరి శ్రీకృష్ణంరాజు అన్నారు. లిఖితపూడిలో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఖితపూడిలో సుమారు 50 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ - కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ నిర్మిస్తున్నామన్నారు. భారత దేశంలోనే ఇది మూడో యూనివర్సిటీ అన్నారు. నాన్నను గెలిపిస్తే మరింత మంచి చేసి చూపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ, ఉంగరాల రమేష్, అడబాల అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

తండ్రి కోసం కుమార్తెల ప్రచారం

ప్రజాశక్తి - ఉండి

తన తండ్రి ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు విజయమే లక్ష్యంగా తనయలు శృతి, శ్రావ్య గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శృతి, శ్రావ్య మాట్లాడుతూ తన తండ్రి శివరామరాజు ఎంఎల్ఎగా పనిచేసిన కాలంలో ఉండి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని 70 గ్రామాల్లో ఎన్‌టిఆర్ సుజల వాటర్ ప్లాంట్లను దాతల సహకారంతో ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు స్వచ్ఛమైన తాగునీటిని అందించారన్నారు. ఆరోగ్యశ్రీ లేని కాలంలోనే శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వేలాది మందికి ఉచిత ఆపరేషన్లు చేయించి ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. శివరామరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించి టిడిపి అధిష్టానానికి సరైన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఈ ప్రచారంలో తెలుగు మహిళా నాయకులు వత్సవాయి సుజాత, వేగేశ్న అనంతలక్ష్మి, పద్మ, మోపిదేవి నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరులో గురువారం ఆయన పర్యటించారు. మాజీ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కలిసి మద్దతు తెలపాలని, కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి కేంద్రం నుంచి ఏమీ సాధించలేకపోయాయన్నారు. కాంగ్రెస్‌తో ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. ప్రచారంలో పిసిసి కాంగ్రెస్ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ ఆకివీడు మండల అధ్యక్షులు చింతా ఆదిశేషు, కాళ్ల మండల అధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం: బిజెపి సపోర్టుగా ఉన్న తోక పార్టీలన్నింటినీ ఓడించాలని కాంగ్రెస్ నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్ (బుజ్జి) అన్నారు. గురువారం పట్టణంలోని మిషన్ హై స్కూల్ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, అది కాంగ్రెస్ వల్లే సాధ్యమని తెలిపారు. పిసిసి అధ్యక్షులు షర్మిల ముఖ్యమంత్రి అవుతారన్నారు. ప్రజాలంతా ఓట్లు వేసి తనను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి శ్రీనివాసరావు, జి.కృష్ణారావు, ఎం.సాల్మన్‌రాజు, సాధనాల చిన్న, మోకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ వేసే నేతలు వీరే..

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు ఈ నెల 19వ తేదీన శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కరకృష్ణ ప్రసాద్ (బుజ్జి) ఈ నెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

తణుకు రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ 19వ తేదీ శుక్రవారం తణుకులోని పాలంగి రోడ్డులో తన నివాసం నుండి ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేయనున్నారు. అదే రోజు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం వద్ద నామినేషన్ దాఖలు చేయనున్నారు.

కాళ్ల : ఈ నెల 19న కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కాళ్లకూరు నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భీమవరం రూరల్ : వైసిపి భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ మరోసారి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నామినేషన్ శుక్రవారం వేయనున్నారు. నామినేషన్ ఉదయం 11 గంటలకు వేయనున్నారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

భీమవరం రూరల్ : వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ నామినేషన్‌కు నరసాపురం పార్లమెంట్ పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ మేరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమించిన వ్యయ పరిశీలకులు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ నిమిత్తం గురువారం ఉదయం జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు పియూష్ శుక్ల, మోహన్ అగర్వాల్, విక్రమాదిత్య మీన కలెక్టరేట్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లోని అన్ని విభాగాలనూ వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఎంసిసి, ఎంసిఎంసి, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ సెల్, సీజర్స్, సువిధ తదితర విభాగాల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులు గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. కంట్రోల్ రూమ్ సేవలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలించిన వారిలో జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ పిడి కానాల సంగీత్‌మాథుర్, అధికారులు పాల్గొన్నారు.

కమాండ్ సెంటర్ పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

ఏలూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమించిన వ్యయ పరిశీలకులు గురువారం ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. గురువారం జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.కీర్తినారాయణ్, షెరింగ్ జోర్డన్ భూటియా, మేశ్రామ్ గౌరవ్ మధుకర్ కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లోని అన్ని విభాగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, సి-విజిల్, సోషల్ మీడియా, కాల్‌సెంటర్, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ విధానం, ఎక్సపెండీచర్ మానిటరింగ్ సెల్, సీజర్స్, సువిధ, గ్రీవిన్స్, రిడ్రెసల్ సెల్ మొదలైన విభాగాల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధుల గురించి పరిశీలకులకు వివరించారు. కంట్రోల్ రూమ్ సేవలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట డిఆర్ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బంది ఉన్నారు.

పరిశీలకులకు స్వాగతం పలికిన కలెక్టర్

ఎన్నికల వ్యయ పరిశీలకులు గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారితో పరిశీలకులు పి.కీర్తి నారాయణ్, షెరింగ్ జోర్డన్ భూటియా, మేశ్రామ్ గౌరవ్ మధుకర్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సార్వత్రిక నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు కచ్చితంగా ఎన్నికల నియమావళి పాటించాలని పేర్కొన్నారు. ఊరేగింపుల్లో పాల్గొనే అభ్యర్థులు, వారి సానుభూతిపరులు ప్రశాంత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి అతిక్రమించిన వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

కాళ్ల:సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు ప్రజలను కోరారు. మండలంలోని ఏలూరుపాడు, కాళ్లకూరు గ్రామాల్లో శివ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి వీధికి ఆటోలో తిరుగుతూ మాట్లాడారు. నియోజకవర్గ అభివద్ధే తన అజెండాగా ముందుకొస్తున్నానని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది లేదన్నారు. ఈ ప్రచారంలో కలవపూడి సర్పంచి గేదెల జాన్, వేగేశ్న బాల గణపతి వర్మ, అల్లూరి అచ్యుతరామరాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

పెనుమంట్ర:మండలంలోని మార్టేరు గ్రామంలో రెడ్డి సామాజిక తరగతికి చెందిన పలువురు రైతులు గురువారం వైసిపిని వీడి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ సమక్షంలో టిడిపిలో చేరినట్లు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కొత్తగా ప్రవేశపెట్టిన భూ సంరక్షణ చట్టం రైతులకు నష్టపరిచేదిగా ఉందని, దీంతో రైతులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. టిడిపిలో చేరిన వారిలో మార్టేరు రెడ్డి నాయకులు వెలగల నాగిరెడ్డి, గుడిమెట్ల వెంకటేశ్వర రెడ్డి, పడాల తిరపారెడ్డి, చిర్ల సురేంద్ర రెడ్డి ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

తణుకురూరల్:పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల పెరిగి మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అన్నారు. గురువారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుపి, పీజీ (అటానమస్)లోని జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో తణుకులో పేద ప్రజలకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సుమారు 25 మందికి దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్ రమేష్‌బాబు, వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిట్టిరాజుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

2024వ సివిల్స్ ఫలితాల్లో 833వ ర్యాంకు సాధించిన శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడు కొయ్యే చిట్టిరాజును మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అభినందించారు. బుధవారం రాత్రి మోషేనురాజు నివాసానికి అంజిబాబు వెళ్లి చిట్టిరాజును అభినందించారు. అలాగే పట్టణ ప్రముఖులు మార్నింగ్ కాఫీ క్లబ్ సంఘం నాయకులు చిట్టిరాజును అభినందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్థానిక అగ్నిమాపక అధికారి గణేశ్న రామారావు ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా నగర్ కాలనీలోని ఎపి ఎస్ఎస్ఎస్ఆర్ స్కూల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు, సిబ్బంది ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగినప్పుడు ఎలా వ్యవహించాలో తెలుపుతూ డెమో నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పెద్ద తాడేపల్లిగూడెంలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 7.00 గంటల నుంచి మద్యాహ్నం 2.00 గంటల వరకూ తాడేపల్లిగూడెం పట్టణ, తాడేపల్లిగూడెం రూరల్ మండలం, పెంటపాడు మండలంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తాడేపల్లిగూడెం ఎపిఇ పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జనసేనలో చేరికలు

నరసాపురం:మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో గురువారం వైసిపి నుండి జనసేనలో భారీగా చేరారు. తొలుత గ్రామంలో భారీ బైక్ ర్యాలీలో జనసేన నేత కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) పాల్గొన్నారు. ఈ మేరకు వైసిపి నాయకులు వెన్న మురళీకష్ణ, మల్లెపూడి చినబాబు జనసేనలో చేరారు. వారితో పాటుగా పార్టీలో భారీగా కార్యకర్తలు చేరారు. వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దెందులూరు, ఉండిపై వీడని సస్పెన్స్..!

(మొదటి పేజీ నుంచి)

చేశారు. టిడిపి అభ్యర్థిని ఇప్పటికీ ఖరారు చేయకపోవడంపై కేడర్‌లో ఒకింత అసహనం వ్యక్తమవుతోంది. నామినేషన్ల పర్వం ప్రారంభమైనప్పటికీ అభ్యర్థి ఎంపికపై ఇంకా సస్పెన్స్ కొనసాగడం అంతటా చర్చనీయాంశంగా మారింది. టిడిపి అధినాయకుడు చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎంఎల్ఎలు అందరికీ టిక్కెట్లు ఇస్తామని ముందుగానే ప్రకటించారు. అన్నట్టుగానే ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిక్కెట్ ఖరారైంది. అనంతరం తలెత్తిన పరిణామాలు పరిస్థితిని పూర్తిగా మార్చేశాయి. వైసిపి నుంచి నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజు ఆ పార్టీపై తిరుగుబావుటా ఎగరేసిన సంగతి తెలిసిందే. బిజెపి, టిడిపికి అనుకూలంగా పనిచేశారు. బిజెపి తరపున ఈ ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా బరిలోకి దిగాలని ఆశించారు. అయితే పొత్తులో భాగంగా బిజెపికి ఈ సీటు దక్కినప్పటికీ రఘురామకృష్ణంరాజుకు ఆ పార్టీ టిక్కెట్ ఇవ్వలేదు. శ్రీనివాసవర్మను ఎంపీ అభ్యర్థిగా బిజెపి ఎంపిక చేయడంతోపాటు బి-ఫారం సైతం ఇచ్చేసింది. రఘురామకృష్ణంరాజుకు ఉండి ఎంఎల్ఎ టిక్కెట్ కేటాయిస్తారని ప్రచారం సాగింది. దీంతో ఆయన టిడిపిలో చేరిన సంగతి తెలిసిందే. ఎంఎల్ఎ రామరాజుకు చంద్రబాబు ఇదే విషయం చెప్పారని తెలియడంతో ఆయన అనుయాయులు తీవ్ర ఆందోళనకు దిగారు. ఇప్పటికీ ఉండి టిక్కెట్ ఎవరికి అనేది టిడిపి తేల్చలేదు. గురువారం నుంచి నామినేషన్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఉండి అభ్యర్థిపై స్పష్టత లేదు. ఈ నెల 22న టిడిపి అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు ఎంఎల్ఎ రామరాజు ప్రకటించడం విశేషం. ఉండి టిక్కెట్ రఘురామకృష్ణంరాజుకా, లేక మంతెన రామరాజుకి ఇస్తారా అనేది సస్పెన్స్ నెలకొంది. దెందులూరు, ఉండి టిక్కెట్‌పై నెలకొన్న సమస్యలు టిడిపిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

తొలిరోజు 8 నామినేషన్లు

(మొదటి పేజీ నుంచి)

నియోజకవర్గాలకు సంబంధించి వైసిపి నుంచి ఏలూరు అసెంబ్లీ స్థానానికి ఆళ్లకాళీకృష్ణ శ్రీనివాస్(నాని), దెందులూరు స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున ఆలపాటి నరసింహమూర్తి, పోలవరం స్థానానికి జనసేన నుంచి చిర్రి బాలరాజు, గోండ్వానా దండకారణ్య పార్టీ నుంచి మడకం వెంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. నూజివీడు నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ముద్దరబోయిన రాధిక నామినేషన్లు వేశారు. తొలిరోజు ఉంగుటూరు, చింతలపూడి, కైకలూరు నియోజకవర్గాల్లో ఎటువంటి నామినేషన్లూ దాఖలు కాలేదు.

జిల్లాలో ముగిసిన సిఎం బస్సుయాత్ర

(మొదటి పేజీ నుంచి)

మీదుగా భీమవరం వరకూ యాత్ర సాగింది. భీమవరంలోని బైపాస్ రోడ్డులో బహిరంగ సభలో పాల్గొని సిఎం మాట్లాడారు. అనంతరం గరగపర్రు, దువ్వ మీదుగా యాత్ర రాజమండ్రి చేరాల్సి ఉన్నప్పటికీ అనూహ్యంగా షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. మంగళవారం రాత్రి తణుకు దగ్గరలోని తేతలిలో సిఎం బసచేశారు. బుధవారం శ్రీరామనవమి కావడంతో బస్సుయాత్రకు విరామం ప్రకటించారు. సిఎం ఎవరితో మాట్లాడకుండా పూర్తిగా విశ్రాంతికే పరిమితమయ్యారు. గురువారం ఉదయం పది గంటల తర్వాత యాత్ర ప్రారంభమైంది. తేతలిలో వృద్ధులతో మాట్లాడిన అనంతరం శర్మిష్ఠ సెంటర్ వద్దకు చేరుకోగానే మెదడు పక్షవాతంతో బాధపడుతున్న తణుకు పట్టణానికి చెందిన ఐదేళ్ల బర్ల దుర్గాఅచ్చుతంకు చెందిన కుటుంబ సభ్యులు రిపోర్టులు బస్సులో ఉన్న జగన్మోహన్‌రెడ్డికి చూపారు. దీంతో బస్సు ఆపి దిగొచ్చిన జగన్ వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్సు యాత్ర ఉమెన్స్ కళాశాల, పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ముఖ్యమంత్రి వెంట మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ఉన్నారు. గురువారం ఉదయం తణుకు నియోజకవర్గంలోని అసంతృప్త నేతలను సిఎం కలుస్తారని ప్రచారం సాగింది. అయితే ఏఒక్కరినీ కలవలేదు. కొంతమందితో ఫోన్లోనే మంతనాలు సాగించినట్లు సమాచారం. తాడేపల్లిగూడేనికి చెందిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎపి కన్వీనర్ గమిని సుబ్బారావు జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు.

మధుషాలినిని అభినందిస్తున్న సిబ్బంది

మహిళా కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా మధుషాలి

ప్రజాశక్తి - నరసాపురం

బిజిబిఎస్ మహిళా కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ కె.మధుషాలిని గురువారం బాధ్యతలు అప్పగించడం జరిగిందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుషాలిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కవిటం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పార్టీకి గుడ్ బై చెప్పి గురువారం టిడిపిలోకి చేరారు. వీరికి మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ సమక్షంలో సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసిపి ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పాలన సాగించారని ఆరోపించారు. పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాల విషయంలో లక్షలాది రూపాయలు దోపిడీ చేసి జేబులు నింపుకున్నారని అన్నారు. టిడిపిలో చేరిన వారిలో గుడిమెట్ల నరేందర్ రెడ్డి, గుత్తుల రామకృష్ణ(రాము) గుడిమెట్ల ఉదయ రెడ్డి, పులగం వెంకట సత్యనారాయణ రెడ్డి, మేడపాటి సూర్యనారాయణ రెడ్డి, బేతిరెడ్డి కృష్ణారెడ్డి, బేతి రెడ్డి సాయి రామిరెడ్డి, బేతిరెడ్డి సుబ్బిరెడ్డి, వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

దత్తసాయి మందిరంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని దత్త సాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొని ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

గందరగోళంలో టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు సైతం గందరగోళంలో ఉన్నారు. రెండు రోజుల క్రితం వరకు టిడిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి ఎవరనేది ఇంకా పూర్తిస్థాయిలో పేరు అధిష్టానం ప్రకటించకపోవడంతో పరిస్థితి అంతా తికమకగా ఉంది. ఇప్పటికైనా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ గురువారం నాడు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అయితే టిడిపి నామినేషన్ ఎప్పుడు వేస్తారు అన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. రఘురామ కృష్ణంరాజు ఒకరోజు, ప్రస్తుత ఎంఎల్ఎ మంతెన రామరాజు మరొక రోజు చెబుతున్నారు. ఎవరి నామినేషన్లకు వెళితే పార్టీ ఆగ్రహిస్తుందో ఎవరి నామినేషన్‌కు బి ఫారం ఇవ్వగలుగుతారో కార్యకర్తలకు అర్థం కావడం లేదని అంటున్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే వారు వ్యతిరేక శక్తులకు సహకరించే పరిస్థితి ఏర్పడుతుందా అని లోలోపల ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకట లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన, అపోహలు చెందవద్దని, అవగాహనతో వ్యవహరించి అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకట లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఎన్‌టిఆర్ జంక్షన్-2 పరిధిలోని 9, 10, 12 వార్డులలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు, డ్రై డే డ్రై డే వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వైద్య ఉద్యోగులు నిరంతరాయంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఫీవర్ సర్వే, డ్రై డే డ్రై డే కార్యక్రమాలను సబ్ యూనిట్ అధికారి పర్యవేక్షణలోని ప్రత్యేక బృందం పరిశీలిస్తూ, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలతో మమేకమై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేస్తూ, పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాలు, పనికిరాని చెత్తా చెదారాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు మేరీ, వెంకటలక్ష్మి, ఆశాలు దుర్గా, లక్ష్మి, వసంత, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకట లక్ష్మణరావు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రొక్కాల నాగ బుజ్జి

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నాగబుజ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలు తమకు ఉన్నటువంటి నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎల్ అండ్ టి అపార్ట్మెంట్స్ వద్ద ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ రొక్కా ఆశీర్వాదం అధ్యక్షతన గత కొన్ని రోజులుగా మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని రొక్కాల నాగబుజ్జి సందర్శించారు. ఈ సందర్భంగా రొక్కాల నాగ బుజ్జి మాట్లాడుతూ ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ద్వారా శిక్షణ పొంది తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబానికి అండగా ఉంటూ డబ్బులు సంపాదించుకోవచ్చు అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం..

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలను మోసం చేయడానికి ఎన్‌డిఎ కూటమి తరుపున అభ్యర్థులు ప్రజల్లోకి వస్తున్నారని, వారిని, వారి హామీలను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 1, 3, 24, 39 వార్డులకు సంబంధించిన టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెరవేర్చే హామీలను మాత్రమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇస్తారని, 2019 ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీలను కూడా ఆయన అమలు చేయడం జరిగిందన్నారు. అయితే 2014లో 600కి పైగానే హామీలను ఇచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. 2019లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కరోనాలో సైతం కూడా అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా భీమవరం నియోజకవర్గంలో ఈ 58 నెలల కాలంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను ఇవ్వడం జరిగిందన్నారు. మరో పక్క ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైసిపి హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత ప్రాతిపదికన జల జీవన్ మిషన్ పథకంలో చర్యలు తీసుకున్నామని అన్నారు. మరోపక్క భీమవరంలో 2,053 సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని తాగునీటి సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులను అందుబాటులో ఉంచడంతోపాటుగా, ఆధునిక వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేసే దిశగా పనిచేయడం జరిగిందన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణ నిమిత్తం రూ.38 కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, నియోజకవర్గంలో తనను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మాదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసిపిలోకి చేరిన యువత

రాధాకృష్ణకు మద్దతుగా ఉంటా : సునంద

ప్రజాశక్తి - తణుకురూరల్

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిగా ఉన్న తణుకు మాజీ ఎంఎల్ఎ రాధాకృష్ణని ఎఎంసి మాజీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకురాలు చిట్టూరి సునంద గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొంత కాలంగా వైసిపి కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న సునంద రాధాకృష్ణని కలవడంతో చర్చనీయాంశంగా మారింది. టిడిపిలో చేరతారనే ప్రచారం జరుగుతుంది. 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి, కారుమూరి వెంకటనాగేశ్వరరావు గెలుపు కోసం ఎంతో కృషిచేశామని, తరువాత జరిగిన పరిణామాల్లో కారుమూరి వెంకటనాగేశ్వరరావు మాపై లేనిపోని ఆరోపణలు చేసి అధికారిక కార్యక్రమాలకు దూరం పెట్టడం జరిగిందని ఎఎంసి మాజీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకురాలు చిట్టూరి సునంద ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వేల్పూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నలుగురు అర్హత లేని కుర్రాళ్లని వెనుక వేసుకుని తిరుగుతానని, మీకు రాజకీయం చేయడం రాదని చెప్పి నన్ను పక్కన పెట్టడం జరిగిందన్నారు. దానితో తీవ్ర మనస్తాపానికి గురయ్యానన్నారు. ఈరోజు వైసిపికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

ఎన్నికలు నీతికి.. అవినీతికి మధ్య పోటీ

నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో నీతివంతమైన పరిపాలనలో ప్రజా సంక్షేమ కోసం పాటు పడే టిడిపికి, అవినీతికి నిలువెత్తు నిదర్శనమైన వైసిపికి యుద్ధమని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. గురువారం నరసాపురం నియోజకవర్గ ఈశాన్య ప్రాంతమైన గొంది గ్రామం నుంచి ఆయన కూటమి అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విజయానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం నరసాపురం మండలం పసలదీవి గ్రామంలో ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు మాట్లాడుతూ రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయానికి 25 రోజుల సమయం మాత్రమే ఉందని అన్నారు.

స్థానిక సంస్థల నిధులు జమచేయాలి

డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక సంస్థలకు వైసిపి ప్రభుత్వం శనిగ్రహంలా పట్టిందని, వైసిపి ప్రభుత్వ దోపిడీ విధానాలతో రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు పంచాయతీలకు చెందాల్సిన రూ.13 వేల కోట్లు స్థానిక సంస్థల నిధులు జగన్ రెడ్డి ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి పంచాయతీ ఖాతాలకు ఒక్క రూపాయి కూడా జమకాలేదంటే అతిశయోక్తి కాదన్నారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆమె గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణపై జగన్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కాజేసిన స్థానిక సంస్థల నిధులు రూ.13 వేల కోట్లు పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు.

నామినేషన్ల ఘట్టం.. బల నిరూపణకు యత్నం..!

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపిల తరపున అభ్యర్థులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పితాని సత్యనారాయణలు బరిలో నిలవడంతో ఆచంట నియోజకవర్గంలో నామినేషన్ల ఘట్టం బల నిరూపణకు వేదికగా నిలవనుంది. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తుండగా అదే తరహాలో వైసిపి అభ్యర్థి, మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. తమ బలబలాలను ప్రదర్శించేందుకు ఇరువురు అభ్యర్థులు ఈ నామినేషన్ల ఘట్టాన్ని అణువుగా మలుచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మరోపక్క ఎవరి సత్తా ఎంత చూద్దాం ఉన్నట్లుగా తటస్థ ఓటర్లు ఆసక్తిగా గమనిస్తున్నారు..

టిడిపి కూటమి సత్తాను నామినేషన్ సందర్భంగా చూపాలని ఆ పార్టీ శ్రేణులతో పాటు మాజీ మంత్రి ముఖ్య అనుచరులు సమాయత్తమవుతున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి నేరుగా ర్యాలీగా ఆచంట తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. వైసిపి అభ్యర్థి, మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా శుక్రవారం ఉదయం నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇరువురి నడుమ పోటీ తీవ్ర స్థాయిలో పోటీ ఉండడంతో నామినేషన్ రోజునే తన సత్తా చాటాలనే ఆలోచనతో రంగనాథరాజు అడుగులు వేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయం తూర్పుపాలెం నుంచి ర్యాలీగా బయలుదేరి ఆచంట తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు.

వైసిపి అభ్యర్థిగా ఆళ్ల నాని నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) గురువారం తొలిరోజు నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి శ్రీరామ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరిన నానికి క్రేన్ల సహాయంతో భారీ గజమాల వేసి అభిమానులు స్వాగతం పలికారు. పాదయాత్రగా బయలుదేరిన నాని ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. యాత్ర అమీనాపేట, అశోక్‌నగర్, డీమార్ట్, సుబ్బమ్మదేవి స్కూల్, 12 పంపుల సెంటర్, కొత్తపేట, నూకాలమ్మగుడి సెంటర్, ఆదివారపుపేట శివాలయం, స్టేడియం సెంటర్, సిఎస్ఐ. చర్చి స్కూల్, ఫ్లయ్‌ఓవర్ మీదుగా పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం, పాత వంతెన, బిర్లాభవన్ సెంటర్, గడియారపు స్తంభం మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటికి నామినేషన్ అందజేశారు. మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు నాని దాఖలు చేశారు. ఆయన వెంట దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి, వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

ఏలూరు ఆర్ఒ కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో వైసిపి శ్రేణులు

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలోకి పార్టీ కార్యకర్తలను అనుమతించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ఆర్ఒ కార్యాలయం గేటు వద్దకు భారీ సంఖ్యలో వైసిపి కార్యకర్తలు చేరుకున్నారు. వారిని నిలువరించడంలో పోలీసులు విఫలమయ్యారు. మూడు వాహనాలు మాత్రమే అనుమతించాల్సి ఉండగా అనేక కార్లు రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం వద్దకు చేరుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. అభ్యర్థితోపాటు సుమారు 15 మంది రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు వచ్చారు. అభ్యర్థితోపాటు మరో నలుగురు మాత్రమే లోనికి వెళ్లాల్సి ఉండగా పదిమంది వరకు వెళ్లారు. కవరేజీకి మీడియాను అనుమతించాలని కోరినప్పటికీ కేవలం ఇద్దరిని మాత్రమే లోపలికి పంపించిన పోలీసులు అభ్యర్థితోపాటు వచ్చిన పర్సనల్ ఫొటోగ్రాఫర్‌ను అనుమతించడం విశేషం. నామినేషన్ దాఖలు చేసింది అధికార పార్టీ అభ్యర్థి కాబట్టి పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరించారనే విమర్శలు విన్పించాయి.

ఏలూరు ఎంపీ ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్

విడుదల చేసిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొత్తం వీడియో చిత్రీకరిస్తారన్నారు. నామినేషన్ దాఖలుకు సంబంధించి అంశాలపై అవగాహన కలిగించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చని, గరిష్టంగా రెండు నియోజకవర్గాల నుండి మాత్రమే నామినేషన్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. నామినేషన్లను ఆర్‌ఒకుగాని, సంబంధిత ఎఆర్‌ఒకుగాని మాత్రమే అభ్యర్థి నేరుగా లేదా తన ప్రపోజర్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో వంద మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలను అనుమతిస్తారని, అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులను మాత్రమే ఆర్ఒ కార్యాలయంలోకి అనుమతిస్తామని వివరించారు.

జెడ్‌పి సిఇఒచే చలివేంద్రం ప్రారంభం

ఏలూరు: ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక జెడ్‌పి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్‌పి సిఇఒ సుబ్బారావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరనాథ్, ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు, సెక్రటరీ కప్పుల సత్యనారాయణ, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ కె.నాగమణి, నేతలు పాల్గొన్నారు.

బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

జీలుగుమిల్లి: బిజెపి మతోన్మాద, కార్పొరేట్ విధానాల నుండి దేశాన్ని రక్షించేందుకు బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎను ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, మత సామరస్యాన్ని కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. గడచిన పదేళ్ల కాలంలో కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, గిరిజనులకు, పేదలకు, సంబంధించిన అనేక చట్టాలను రద్దు చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ ఎన్నికలొచ్చిన ప్రతిసారీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఇండియా వేదిక తరపున బరిలోకి దిగిన కాంగ్రెస్ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి సృజన, ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడగా సభ్యులు రాజమండ్రి దానియేలు, సిరిబత్తుల సీతారామయ్య, నేలటూరి అప్పారావు, కొండలరావు, కారం నాగదుర్గ, వివిధ గ్రామాల శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.లక్ష నగదు సీజ్

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు అధికారి మహ్మద్ మొహిద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా గుండుగొలనుగుంట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద రూ.లక్ష స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఎస్ఐ స్వామికి అందజేయగా నగదును ట్రెజరీలో జమ చేశారని తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యారావు, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

గోపాలపురం టిడిపి అభ్యర్థిగా మద్దిపాటి నామినేషన్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

టిడిపి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా మద్దిపాటి వెంకటరాజు గురువారం గోపాలపురంలో నామినేషన్ వేశారు. తొలుత ఆయన చినవెంకన్నను దర్శించుకుని పార్టీ శ్రేణులతో కలిసి పెద్దఎత్తున ర్యాలీగా గోపాలపురం వెళ్లారు. కార్యక్రమంలో బిజెపి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురంధరేశ్వరి, మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ మంత్రి జవహర్, జనసేన నేత దొడ్డిగర్ల సువర్ణరాజు, యద్దనపూడి బ్రహ్మరాజు పాల్గొన్నారు.

దెందులూరు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గా ఆలపాటి నరసింహామూర్తి గురువారం దెందులూరులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఆలపాటి నాగ కుమారి, కైకలూరు కాంగ్రెస్ అభ్యర్థి నోబుల్ ఉన్నారు. తొలుత పెదవేగి మండలం మొండూరు నుంచి ర్యాలీగా దెందులూరు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నేత కె.శ్రీనివాస్, కాంగ్రెస్ యువనేత ఆలపాటి వెంకటచౌదరి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు స్వతంత్ర అభ్యర్థిగా ముద్దరబోయిన నామినేషన్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్, ముసునూరు

నూజివీడు స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన నామినేషన్ దాఖలు చేశారు. తొలుత పట్టణంలో ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్ఒ, ఆర్‌డిఒ వై.భవాని శంకరికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయనతోపాటు ఆయన సతీమణి ముద్దరబోయిన రాధిక కూడా నామినేషన్ దాఖలు చేశారు.

నూజివీడులో నామినేషన్ వేస్తున్న ముద్దరబోయిన

తొలిరోజు ఒకేఒక్క నామినేషన్

కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థిగా సూర్యనారాయణరెడ్డి నామినేషన్ దాఖలు

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్లు నిల్

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభమైంది. భీమవరం కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ సాగింది. అయితే ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఈ ఎన్నికల్లో తొలిరోజు ఒకేఒక్క నామినేషన్ దాఖలైంది. నరసాపురం ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి నామినేషన్ వేశారు. ఒక్క సెట్ నామినేషన్ పత్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్‌కు అందజేశారు. మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదని సుమిత్‌కుమార్ ప్రకటించారు. నామినేషన్ కేంద్రంలో కలెక్టరేట్ ఎఒ పి.పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు ఉన్నారు.

నేడు పెద్దసంఖ్యలో నామినేషన్లు వేయనున్న అభ్యర్థులు

జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ నెల 19న జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఉండి వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహారాజు నామినేషన్ వేయనున్నారు. పెదఅమిరం నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. తణుకు టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, నరసాపురం వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, పాలకొల్లు టిడిపి అభ్యర్థి నిమ్మల రామానాయుడు, కాంగ్రెస్ అభ్యర్థి అర్జునరావు, ఆచంట టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణ, వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు భారీ ర్యాలీలు చేపట్టి నామినేషన్లు వేయనున్నారు. ఈ నెల 22న నరసాపురం జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, ఉండి టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు, 24న తాడేపల్లిగూడెం కాంగ్రెస్ అభ్యర్థి మర్నీడు శేఖర్ బాబ్జి నామినేషన్లు వేయనున్నారు.

ఉపాధి హామీ నిధులు కూలీలకే వినియోగించాలి : వ్యకాస

పాలకోడేరు మండలంలో..

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి హామీ నిధులను కూలీలకు ఉపాధి కల్పనకే వినియోగించాలని, ఉద్యాన మొక్కల పెంపకానికి వినియోగించాలనే నిర్ణయం సరికాదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. డెల్టా ప్రాంతంలో ఉపాధి హామీ నిధులను ఉద్యాన మొక్కల పెంపకానికి వినియోగించాలనే నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి లేకుండా చేయడమేనని విమర్శించారు. గురువారం పెనుగొండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు నేతలు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో పంట, మురుగు కాలువలు జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయని, అవి కాకుండా రైతుల పంట పొలాల్లో మొక్కలు పెంచే కార్యక్రమం చేపడితే కూలీలకు ఉపాధి పోయి భూయజమానులకు మేలు జరుగుతుందని అన్నారు. సంఘం మండల కార్యదర్శి పూతినీడి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా మాట్లాడుతూ ఇప్పటికే మురుగు, పంట కాలవల్లో తాగేసి పగులగొట్టి పడేసిన బీరు బాటిల్స్ గాజు పెంకుల వల్ల పని చేస్తున్న కూలీలకు గాయాలవుతున్న పరిస్థితి ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600కు పెంచాలని, 200 రోజులు పనులు కల్పించాలని, బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించి అడిగిన వారందరికీ పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ వేసే విధానం వెనక్కి తీసుకుని పాత మస్టర్ విధానాన్ని కొనసాగించాలని, అందరికీ పనిముట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పి.విష్ణుమూర్తి, శీలబోయిన శ్రీనివాస్, పూతినీడి భాస్కరరావు, బొక్కా లక్ష్మి, కడలి మల్లేశ్వరి, ఎం.సత్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు: కరోనా కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల మరణాలు తక్కువ సంభవించాయంటే నాడు ఉపాధి హామీ పనులు కల్పించడం, కష్టపడి పని చేయడమే కారణమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. కొండేపూడిలో పని ప్రాంతంలో కూలీలను సంఘం నేతలు గురువారం కలిశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బడ్జెట్లో రూ.లక్షా 19 వేల కోట్ల నుండి కేవలం రూ.60 వేల కోట్లకు కోత విధిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు లేకుండా చేసే ప్రయత్నాలు తీవ్రతరం చేస్తోందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హరించిందన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ నిధులు పెంచి అన్ని రకాల పనులను కూలీలతో చేయించాలని కోరారు. రైతుల పొలాల్లో పండ్ల తోటలు పెంచేందుకు ఉపాధి నిధులు ఖర్చు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కూలీల హక్కులను హరించడమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీలో అడిగిన వారందరికీ పనులు కల్పించకపోతే వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని లింగరాయుడుగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా సోమరాజు కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నేల గట్టిదనం వల్ల గునపం దిగడం లేదని, దీంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.300 కూడా రావడం లేదని తెలిపారు.గోవర్ధన్, మైనం ఉదయ్, కనకదుర్గ, వరలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.